క్లుప్తంగా

సబ్సిడీపై పాడి గేదెలను అందించాలి

చిట్యాల : గొల్ల, కురుమ, యాదవులకు గొర్రెలతోపాటు సబ్సిడీపై పాడి గేదెలను అందించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలోని పీఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన యాదవ కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడబోయిన లింగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మోటె కృష్ణయ్య యాదవ్, చొప్పరి నర్సింహ, మెండె గోపాల్, పోషబోయిన అయిలయ్య, మోటె మల్లయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కనగల్ : మండల పరిధిలోని జి.యడవల్లి ఉన్నత పాఠశాలలో 2006–07 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని అలివేలు భర్త బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు అలివేలు కుటుంబానికి ఆదివారం పూర్వ విద్యార్థులు రూ.33 వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం : రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీలకు శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాగిణి ఆదివారం తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు డి.సంధ్య పర్యవేక్షణలో విద్యార్థులు అబ్దుల్ హకీం, గుండా రక్షిత, ఎస్.అంబికా సాయి, డి.నికేష్‌ల ఇన్నోవేషన్ 'ఆటోమేటిక్ స్పీడ్ లిమిట్ ఆఫ్ వెహికిల్ డిపెండ్స్ ఆన్ రోడ్స్' రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13000 ఇన్నోవేషన్‌లలో కేవలం 70 ఇన్నోవేషన్‌లను ఎంపిక చేశారన్నారు. అందులో జిల్లా నుంచి వల్లాల మోడల్‌స స్కూల్ విద్యార్థుల ఇన్నోవేషన్ ఎంపికయిందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి ఆదివారం ప్రకటించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్క తిరుపతయ్య, మండల మహిళా అధ్యక్షురాలిగా ఎర్రని అనిత, ఉపాధ్యక్షులుగా కల్లెం యాదగిరిరెడ్డి, బండా యాదయ్య, మాదగోని కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులుగా సిద్దాపురం జంగయ్య, మాదగోని కృష్ణయ్య, కోశాధికారిగా కొట్టం శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శులుగా పగిళ్ల యాదయ్య, మహమ్మద్ జమీల్‌లను నియమితులయ్యారు.

45వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు


దీక్షకు మద్దతు తెలుపుతున్న రైతులు

మునుగోడు : మండల పరిధిలోని కిష్టాపురంలో ఫార్మా కంపెనీ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం 45వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు తిప్పర్తి గ్రామ రైతులు స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, యాదయ్య, శ్రీను, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నల్లగొండ టౌన్ : ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ మలే సంతోష్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలో ఆర్యాన్స్ యోగా ఫిట్‌నెస్ సెంటర్, తులసి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో యోగా శిక్షకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు దినచర్యలో యోగా, వాకింగ్, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఈ శిబిరంలో సుమారు వందమంది యోగా శిక్షకులకు ఉచితంగా బీపీ షుగర్ థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్పన, యోగా గురు సంధ్య, చొక్కారపు మాధవి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పల్లెపల్లెకు పదివేల మొక్కలు

- కేతేపల్లి మండలంలో 1.60 లక్షల మొక్కల పెంపకం
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాటేలా ప్రణాళిక
- ఉపాధి హామీ కూలీల ద్వారా గుంతల తవ్వకం


కేతేపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

కేతేపల్లి : తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న అన్ని గ్రామాల్లో మాస్ ప్లాంటేషన్ పేరిట భారీ సంఖ్యలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధి హామీ కూలీలలో తీయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎండిపోతే కొత్తవి నాటేలా..

కేతేపల్లి మండలంలోని 16 గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు నిర్వహిస్తున్నారు. తొమ్మిదో విడత హరితహారంలో మొత్తం 1.45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈమేరకు ఒక్కో నర్సరీలో పదివేల మొక్కల చొప్పున మొత్తం 1.60 లక్షల మొక్కలు పెంచుతున్నారు. నాటిన అనంతరం కొన్ని మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు అందుబాటులో ఉండే విధంగా అదనంగా మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుగుణంగా గన్నేరు, మందార వంటి పూల మొక్కలు, దానిమ్మ, బొప్పాయి, జామ, ఉసిరి వంటి పండ్ల మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ కింద కానుగ, గుల్‌మోర్, చింత, వేప తదితర మొక్కలను పెంచుతున్నారు.

మొదటి రోజు 500 మొక్కల చొప్పున..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న అన్ని గ్రామాల్లో మాస్ ప్లాంటేషన్ పేరిట భారీ సంఖ్యలో మొక్కలు నాటి తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మొదటి రోజున గ్రామానికి 500 మొక్కల చొప్పున 16 గ్రామాల్లో మొత్తం 8,000 మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించి ఉపాధి కూలీలతో గుంతలు తీయించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

కూలీలకు ఉపాధి

వేసవిలో పనులు దొరకక జీవనోపాధి కష్టంగా మారుతున్న నేపథ్యంలో నర్సరీల ఏర్పాటుతో గ్రామాల్లో ఉపాధి లభించడంతో కూలీలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నర్సరీలో పది మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. వారికి ఉపాధి హామీ పథకం ద్వారా డబ్బులు చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

16 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం



మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. నర్సరీల్లో ప్రధానంగా పండ్లు, నీడనిచ్చే మొక్కలు సిద్ధం చేశాం. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు రెండు మార్లు నీరు పెట్టిస్తున్నాం. ఎండల నుంచి సంరక్షణకు గ్రీన్ షేడ్‌నెట్లు ఏర్పాటు చేశాం. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెంచుతున్నాం.

– సురేందర్, ఈజీఎస్ ఏపీఓ, కేతేపల్లి

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు అవసరమైన నిధులు మంజూరు చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. చిట్యాల మండలం సుంకెనెపల్లి గ్రామంలోని మల్లన్నస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. అంతకు ముందు గుండ్రాంపల్లి గ్రామంలోని శ్రీ ఆదిపరాశక్తి లక్ష్మీదేవమ్మ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య యాదవ్, సర్పంచ్ రత్నం పుష్పనర్సింహ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, కొలను వెంకటేష్‌గౌడ్, చెరుకు మధుకుమార్‌గౌడ్, బాతరాజు రవీందర్, నరేందర్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని అక్షర పాఠశాలలో శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్య కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్య సమాజ మందిర్ అధ్యక్షుడు బోయినపల్లి కృష్ణారెడ్డి, అక్షర పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ హాజరై చిన్నారులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు కళలపై ఆసక్తి చూపేవిధంగా తల్లిదండ్రులు చూడాలని కోరారు. సంస్థ నిర్వాహకులు పాలబిందల బాలు 25 సంవత్సరాలుగా చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బాలు కుమార్తె పాలబిందల సాత్విక కూడా చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిని వివరించాలి


మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతి అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మునుగోడులో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో గుమ్మకొండ రఘునందన్ రెడ్డి, మేకల నర్సింహారెడ్డి, ఆనందరావు, మెండు నర్సింహారెడ్డి, వెన్నమనేని దామోదర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, శ్యాంసుందర్, బేత వెంకటేష్, కిరణ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : పానగల్లు శ్రీ శంకర గోశాల శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యావాచకం, పంచగవ్య ప్రాసన, అఖండ దీపస్థాపన, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, దేవతాహానం, లక్ష్మీహావనం, సుదర్శన వనం, నీరాజనం, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాపోలు శ్రీనివాస్, తోట రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి మహోత్సవం


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మర్రిగూడ : మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి బొడ్రాయి వద్ద నైవేద్యంగా సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాడం శాంతమ్మ వెంకటయ్య, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, ఎంపీటీసీ దంటు జ్యోతిజగదీశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, జమ్ముల వెంకటేష్, చామకూరి అబ్బయ్య, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు నివాళి

నల్లగొండ టౌన్ : ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో నల్లగొండ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది గాయకులు బాలసుబ్రహ్మణ్యం పాటలను పాడారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, కేశవాచారి, టి రమేష్, ప్రకాష్, కత్తుల శంకర్, జి సుధాకర్, జెల్లా పుల్లయ్య, బి వెంకటేశ్వర్లు, మారం గోపాల్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, రామలింగం, దేవదానం, హుస్సేన్, యాదయ్య, ఆంజనేయులు, లక్ష్మయ్య, రఘునాథం పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పాటుతోనే పోలీస్ శాఖలో సంస్కరణలు


ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


వేడుకల్లో మాట్లాడుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

- ఘనంగా సురక్షా దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ చైర్మన్, నల్లగొండ ఎమ్మెల్యే

నల్లగొండ క్రైం : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖను ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 10వ ఏడాదిలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రగతిని శాఖలవారీగా ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు మరింత పటిష్టం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రజలకు తక్షణమే రక్షణ కలిస్తున్నట్లు తెలిపారు. షీటీం, భరోసా, డయల్ 100, మరింత విస్తృతపరిచి ప్రజలకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ శాఖ సంక్షేమానికి రూ.50లక్షల సొంత నిధులు ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు జిల్లాలో నేర సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా, యువత గంజాయి వైపు వెళ్లకుండా నకిలీ విత్తనాలు అమ్మకుండా పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల వల్లనే జిల్లాలో పారిశ్రామిక విస్తరణ జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 21రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇచ్చి అధిక బడ్జెట్ కేటాయించారన్నారు. జిల్లాకు 40 పెట్రోలింగ్ వాహనాలు, 100 పెట్రోలింగ్ బైక్‌లు, అవసరమైన సాంకేతిక కమ్యూనికేషన్ పరికరాలు అందించినట్లు తెలిపారు. ప్రజా రక్షణ కోసం డయల్ 100 కు ఫోను రాగానే 7 నిమిషాల వ్యవధిలో బాధితుల వద్దకు చేరుకుంటున్నారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా 775 ల్యాండాడర్ పోలీస్ స్టేషన్లు ఉంటే అన్నీ కమాండ్ కంట్రోల్ పరిధిలోనే పని చేస్తున్నాయన్నారు. జిల్లాలో 7వేల సీసీ కెమెరాలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, పోలీస్ రక్షణ కవచాలు, బాంబ్ స్క్వాడ్ పని చేసే విధానం, షీటీం, భరోసా, చిన్న పిల్లల రక్షణ చట్టాలు, ట్రాఫిక్ విభాగం స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి


హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నల్లగొండలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


కట్టంగూర్ : సాందీపని ఉన్నత పాఠశాలలో..


శాలిగౌరారం : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


మునుగోడు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : కనగల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో గల ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలుసుకొని అప్పటి ఉపాధ్యాయులు ముత్యంరెడ్డి, కృష్ణయ్య, దామోదర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బీరగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, జానయ్య, వెంకటరమణ, అనంతచారి, మారం శ్రీనివాస్, హరిత, పుష్ప, విజయలక్ష్మి, విజయేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, లింగారెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రంలోని శాలిగౌరారంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో 2002–03 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు వెంకటయ్య, కృష్ణారెడ్డి, కుశలవరెడ్డిలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కట్టంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు శాలువా కప్పి, మెమొంటో అందజేసి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి సాగర్, రాములు, కానుగు లింగయ్య, పటేల్ నర్సిరెడ్డి, ప్రకాశ్, శాలి, నాగిరెడ్డి, అంజిరెడ్డి, పద్మ, కళావతి, లక్ష్మి, పూర్వ విద్యార్థులు రెడ్డిపల్లి శంకర్, మాదగోని సత్యనారాయణ, ముత్యాల లింగయ్య, ఐతగోని గౌతమ్, దండెంపల్లి వెంకన్న, చెవుగోని సత్యనారాయణ, మధు, శ్రీపాద పవన్, తేలు దయాకర్, గుండు నాగరాజు, ఆకుల వెంకన్న, పోగుల శంకర్, నాగరాజు, రమేష్, స్వప్న, కవిత, మంజుల, అనూష, వాసవి పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, యాదగిరిరెడ్డి, నల్లి రంజన్, భాస్కర్‌రావు, నర్సింహ, సత్తిరెడ్డి, పూర్వ విద్యార్థులు పల్లెర్ల శ్రీకాంత్, లక్ష్మణ్, రమేష్, గిరి, మురళి, వెంకట్‌రెడ్డి, శివయ్య, సింగారం మాజీ సర్పంచ్ పోగుల జానకి, గీతభవాని, శోభ, శ్రీలత, సుజాత, నిర్మల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఆయన పర్యటించారు. వార్డు పరిధిలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రూ.36కోట్లతో నిర్మాణం చేపట్టనున్న 100పడకల ప్రభుత్వ ఆస్పత్రి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఎండి.బాబాషరీఫ్, సుల్తాన్ రాజు, నాయకులు తొర్పునూరి నర్సింహ్మ, చెవగోని వెంకటేశ్, మహేష్, స్థానికులు నర్సింగ్‌రావు, నర్సింహ్మ, శ్రీహరి, అశోక్, కిషన్, జంగయ్య, నాగరాజు, వేణు తదితరలు ఉన్నారు.

దేవాలయానికి రూ.3లక్షల విరాళం

మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామంలో ఆదివారం జరిగిన ముత్యాలమ్మ దేవాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి రూ.3లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సభ్యుడు ముప్పిడి శ్రీనివాస్, గ్రామస్తులు చెక్క శ్రీనివాస్, శివకుమార్, శ్రీకాంత్, సత్తిబాబు, భాగ్యమ్మ, నర్సింహ, రాములు, నరేష్, మల్లేష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులు గోస పడుతుంటే సంబరాలా..'

మిర్యాలగూడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గోస పడుతుంటే 22 రోజుల పాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంబరాలు నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ మోర్చా పట్టణ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా అని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని, రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ నేటికీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు బి. అంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకుడు అమిరెడ్డి రామచంద్రారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు వినయ్, జాను నాయక్, పి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.